క్లుప్తంగా

గ్రంథాలయాలను వినియోగించుకోండి



తెనాలిరూరల్: కొలకలూరు శాఖా గ్రంథాలయాన్ని ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి.సుబ్బరత్నమ్మ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎక్కువ మంది చదువరులు గ్రంథాలయ సభ్యత్వం తీసుకునే విధంగా, గ్రంథాలయాన్ని ఎక్కువ మంది పాఠకులు వినియోగించుకునే విధంగా చేయాలని ఈ సందర్భంగా ఆమె గ్రంథాలయాధికారి కడియాల సుజాతను ఆదేశించారు. ఇక్కడ అందుతున్న గ్రంథాలయ సేవల గురించి పాఠకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రంథాలయ భవనాన్ని పరిశీలించారు. పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. మే 7వ తేదీ వరకు గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతులను నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి తెలిపారు.

గ్రంథాలయంలో ఆకస్మిక తనిఖీ

తెనాలి: గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంకదారి సుబ్బరత్నమ్మ బుధవారం స్థానిక నెహ్రూ రోడ్డులోని శాఖా గ్రంథాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. లైబ్రరీలోని పోటీ పరీక్షల పుస్తకాలతో గ్రూప్–2 మెయిన్స్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల అవసరాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయ రికార్డులు పరిశీలించి సంతృప్తిని వ్యక్తంచేశారు. గ్రంథాలయ సెస్సు వసూలుకు తగిన కృషి చేయాలని ఆదేశించారు. వీరితో గ్రేడ్–1 లైబ్రేరియన్ కె.రమాదేవి, సిబ్బంది ఉన్నారు.

తెనాలిలో ఐదు నామినేషన్లు దాఖలు

తెనాలిరూరల్: సార్వత్రిక ఎన్నికలకు తెనాలి నియోజకవర్గానికి సంబంధించి బుధవారం ఐదు నామినేషన్లు దాఖలయ్యాయి. వైఎస్సార్ సీపీ తరపున అన్నాబత్తుని శివకుమార్ రెండు సెట్ల నామినేషన్ పత్రాలను సమర్పించారు. బోస్‌రోడ్డు నుంచి వేలాది కార్యకర్తలతో ఊరేగింపుగా సబ్‌కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేశారు. జనసేన పార్టీ తరపున నాదెండ్ల మనోహర్ నామినేషన్ వేశారు. ఐతానగర్ లింగారావు సెంటరు నుంచి ర్యాలీగా వచ్చి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. తెలుగు జనతా పార్టీ తరపున కందూరి నాగరాజు నామినేషన్ వేశారు. తుమపాల నరేంద్ర, షేక్ జానీబాషా ఇండిపెండెంట్లుగా నామినేషన్లు రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. బుధవారం నాటికి మొత్తం 16 సెట్ల నామినేషన్లు అందినట్టు సహాయ రిటర్నింగ్ అధికారి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

దుర్గాప్రసాద్‌కు ఘన నివాళి



తెనాలి: పట్టణానికి చెందిన సాహితీ సాంస్కృతిక సంస్థ ప్రజ్వలిత వ్యవస్థాపక అధ్యక్షుడు నాగళ్ల వేంకట దుర్గాప్రసాద్ జయంతి సందర్భంగా స్థానిక బుర్రిపాలెంరోడ్డులోని ఆయన కాంస్య విగ్రహానికి పలువురు కళాకారులు పుష్పాంజలి ఘటించారు. పట్టణ రంగస్థల కళాకారుల సంఘం అధ్యక్షుడిగా, ప్రజ్వలిత అధ్యక్షుడిగా, కళా, సాహిత్య రంగాలకు ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. ఆ కార్యక్రమాలను కొనసాగించటమే ఆయనకిచ్చే నివాళిగా పలువురు అభిప్రాయపడ్డారు. పట్టణ రంగస్థల కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి గరికపాటి సుబ్బారావు, ప్రజ్వలిత సభ్యులు దేవిశెట్టి కృష్ణారావు, కొండముది రమేష్, కనపర్తి బాబూరావు, చిట్టూరి సీతారామయ్య, కన్నెగంటి మధు, ఆర్అండ్‌బీ రాజు, చందు సూర్య, యోహాను, వేము రామరాజు, డి.అప్పయ్య, జి.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యానుకు ఓటు వేసి పేదల ప్రభుత్వాన్ని గెలిపిద్దాం



తెనాలిఅర్బన్: మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో అందరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని వైఎస్సార్ సీపీ తెనాలి నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ సతీమణి పుష్ప కోరారు. పట్టణంలోని 4వ వార్డులో బుధవారం సాయంత్రం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమం, అభివృద్ధిని తెలియజేసి వాటికి సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీని ప్రజలంతా ఒక్కటై గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ క్లస్టర్–1 అధ్యక్షుడు మద్దాలి శేషాచలం, వైఎస్సార్ సీపీ నాయకులు రాజ్యలక్ష్మి, చెరుకూరి సురేష్, పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



శివకుమార్, కిలారి వెంకట రోశయ్యలకు పండ్లతో చేసిన భారీ గజమాలను ప్రదర్శిస్తున్న అభిమానులు



శివకుమార్ నామినేషన్ సందర్భంగా తెనాలి పట్టణంలో నిర్వహించిన భారీ ర్యాలీ

అశేష జనవాహినితో కిక్కిరిసిన ఆంధ్రా ప్యారిస్

ఆంధ్రా ప్యారిస్ తెనాలి జన సంద్రాన్ని తలపించింది. వేలాది మంది అభిమానుల కోలాహలం మధ్య స్థానిక వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ బుధవారం నామినేషన్ దాఖలు చేశారు.ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్యతో కలిసి అభిమానులు చేపట్టిన భారీ ర్యాలీతో సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకొని నామినేషన్ దాఖలు చేశారు. దారిపొడవునా పార్టీ నాయకులు, కార్యకర్తలు సందడి చేశారు. మహిళా డప్పు వాద్యకారులు, తీన్‌మార్ వాద్య బృందం, కళాకారుల విన్యాసాలు పట్టణ వాసులను ఆకట్టుకుంది. యాపిల్, బత్తాయి పండ్లతో తయారు చేసిన భారీ గజమాలతో అభిమానులు ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు స్వాగతం పలికారు. 'లోకల్ శివన్న' నినాదంతో వేలాది గొంతుకలు ప్రతిధ్వనించాయి.

– తెనాలి



నామినేషన్ దాఖలు అనంతరం శివకుమార్‌కు మద్దతు తెలిపిన న్యాయవాదులు



కేరళ సంప్రదాయ డప్పు కళాకారుల బృందం వాద్యఘోష



శివకుమార్ కటౌట్లను ధరించి కళాకారిణుల నృత్య విన్యాసాలు

శివకుమార్ నామినేషన్‌కు తరలిన జనం

కొల్లిపర: వైఎస్సార్ సీపీ తెనాలి నియోజకవర్గ అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్(లోకల్ శివన్న)కి కొల్లిపర మండలంలోని ప్రజలు సంపూర్ణ మద్దతు తెలిపారు. బుధవారం ఆయన నామినేషన్‌కు మండలంలోని 20 గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివెళ్లారు. ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి, మండల కన్వీనర్ అవుతు పోతిరెడ్డి, ఆరిగ చంద్రారెడ్డి, వివిధ గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకుల పర్యవేక్షణలో ఉదయం 9 గంటల నుంచి ప్రజలు ఆటోలు, బైక్‌లు, కార్లు, వ్యానుల్లో వేలాదిగా పయనమయ్యారు. ప్రతి గ్రామం నుంచి సుమారు 5 వేల మంది ప్రజలు ర్యాలీగా బయలు దేరి తెనాలిలోని శ్రీకన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం వద్దకు చేరుకున్నారు. అక్కడ ఉన్న ఎమ్మెల్యే అభ్యర్థి శివకుమార్‌ను కలసి మండలంలోని పార్టీ నాయకులు, యువత శివకుమార్‌కి భారీ గజమాలలు, పూలమాలలు వేశారు. ర్యాలీ కార్యక్రమంలో అవుతు నగేష్‌రెడ్డి, అవుతు శేకరరెడ్డి, కళ్ళం వెంకటప్పారెడ్డి, వేమూరి కిషోర్‌బాబు, దూరురత్నబాబు, యంద్రపాటి మృత్యుంజయరావు, భీమవరపు శివకోటిరెడ్డి, అవుతు కృష్ణారెడ్డి, కళ్ళం వీరారెడ్డి, నెర్ల కుటుంబరెడ్డి, భీమవరపు చిన్న రామిరెడ్డి, చెంచల రామిరెడ్డి, గుదిబండి కృష్ణ కిషోర్‌రెడ్డి, పిల్లి గంగాధర్, ఎ.సురేష్, ఉన్నవ నాని, బొమ్ము శ్రీనివాసరెడ్డి, తాత శ్రీనివాసరావు, బొమ్ము నాగ వెంకటేశ్వరరెడ్డి, తోడేటి దాసు, ఈమని హరికోటిరెడ్డి, మర్రెడ్డి బ్రహ్మారెడ్డి, కొల్లి రాఘవరెడ్డి, మోర్ల శ్రీను, ఉయ్యూరు ఉమామహేశ్వరరెడ్డి, బేతాల భూషణం, పల్లె మధుసూధనరావు, అద్దంకి వేణుగోపాల్‌గౌడ్, మర్రెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, మత్తే ఇంద్రజిత్‌కుమార్, బొంతు వేణుగోపాలరెడ్డి, పచ్చవ రమేష్‌బాబు, బొల్లిముంత పోతురాజు,జ్యోతుల బాగ్యమ్మ, రెడిరౌతు బాలరాజు, వివిధ గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత పాల్గొన్నారు.



చెముడుబాడు నుంచి నామినేషన్ కార్యక్రమానికి తెనాలి తరలిన అభిమానులు

ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోండి



నృత్యం చేస్తున్న చిన్నారులు

తెనాలిఅర్బన్: ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని వాటిని సాధించే దిశగా కృషి చేయాలని షారోన్ విద్యాసంస్థల డైరెక్టర్ శ్యామ్ బెనర్జీ సూచించారు. మారీసుపేట రెండు గేట్ల మధ్యలోని సెయింట్ పాల్స్ ఇంగ్లీషు మీడియం స్కూల్ వార్షికోత్సవాన్ని కొత్తపేటలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేటి విద్యావిధానంలో అనేక నూతన మార్పులు వస్తున్నాయని చెప్పారు. వాటికి అనుగుణంగా విద్యాబోధన చేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని చెప్పారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో సెయింట్ పాల్స్ ఇంగ్లీషు మీడియం వ్యవస్థాపకులు ఎండీ చావాలి, డైరెక్టర్లు చావాలి తేజోనాథ్, అకుల్‌నాథ్, ప్రిన్సిపల్ దివ్యతేజ, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో హెల్త్ కమిషనర్ ఆకస్మిక తనిఖీలు



జీజీహెచ్ సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశ్వర్

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ చిన్న పిల్లల వార్డు, కాన్పుల వార్డులను రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఎస్. వెంకటేశ్వర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల కాలంలో ఆస్పత్రుల్లో చిన్న పిల్లల అపహరణ జరుగుతున్న నేపథ్యంలో వాటిని అరికట్టడానికి ఏర్పాటు చేసిన ఆర్ఎఫ్ఐడీ పని తీరును ఆయన పరిశీలించారు. ఆస్పత్రి నుంచి చిన్న పిల్లలను గుర్తు తెలియని వ్యక్తులు గుట్టు చప్పుడు కాకుండా తీసుకుని వెళ్లే వారిపై నిఘా పటిష్టం చేస్తున్న విధానాన్ని ఆయన నిశితంగా పరిశీలించారు. తల్లి, బిడ్డకు ఏర్పాటు చేసిన ట్యాగ్ పని తీరును కూడా ఆయన పరిశీలించారు. కాన్పుల వార్డులో బాలింతలతో కమిషనర్ మాట్లాడారు. సాధారణ ఆపరేషన్లు జరుగుతున్నాయా, శస్త్ర చికిత్సలు జరుగుతున్నాయా అనే విషయాలపై బాలింతల తల్లులతో మాట్లాడారు. తల్లి,బిడ్డ క్షేమం కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. 24 గంటలపాటు తల్లి,బిడ్డ పర్యవేక్షణ చూడాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఆస్పత్రిలోని పలు వార్డులను సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలపై కమిషనర్ సంతృప్తి వ్యక్తం చేసినట్లు చెప్పారు. పసిబిడ్డలకు ట్యాగ్స్ అమర్చేప్రక్రియ నర్సింగ్ సిబ్బంది చేయాలని కమిషనర్ సూచించారన్నారు. ప్రైవేట్ ఆస్పత్రిలో కాన్పు అయిన తరువాత చిన్నపిల్లల వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే నవజాత శిశువులకు ఈ ట్యాగ్‌లు అమర్చాలని సూచించినట్లు వెల్లడించారు. తల్లికి అమర్చే ట్యాగ్ లు లాక్ సిస్టం లేదని, అది అత్యవసరమని కమీషనర్ దృష్టికి తీసుకు వెళ్లినట్లు చెప్పారు. ఈ మార్పుకు అంగీకరించి వెంటనే అమలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించినట్లు సూపరింటెండెంట్ వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విజయలక్ష్మి ఉన్నారు.

రాయితీని సద్వినియోగం చేసుకోండి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణ పరిధిలోని ఇంటి, ఖాళీస్థలాల పన్నులను ఒకేసారి చెల్లిస్తే ప్రభుత్వం ఐదు శాతం రాయితీ ఇస్తుందని, దీనిని అందరూ ఉపయోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తెలిపారు. ప్రముఖ వ్యాపారి కొత్త మాసు తులసీదాసుకు సంబంధించిన ఆస్తి పన్నుల చెక్కును బుధవారం కమిషనర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 30లోపు ఏడాదికి సంబంధించిన పన్నులను చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ అధికారి సోమశేఖర్ యాదవ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మోహన్‌కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



పన్నుకు సంబంధించిన చెక్కును అందుకుంటున్న కమిషనర్ శేషన్న

నేడు పలు గ్రామాల్లో రోడ్ షో

తెనాలిఅర్బన్: ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్సార్ సీపీ తెనాలి నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం 4 గంటలకు తెనాలి మండల పరిధిలోని కోపల్లె, గుడివాడ, ఎరుకలపూడి, కఠెవరం గ్రామాల్లో రోడ్డు షో నిర్వహించనున్నట్లు పార్టీ కార్యాలయ వర్గాలు తెలిపాయి. రోడ్డు షోలో ఎమ్మెల్యే అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్‌లు, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

డోలు, నాదస్వరంతో వినూత్న నృత్యం

పలువురికి యువ కళారత్న పురస్కారాలతో సత్కారం



నృత్యం చేస్తున్న దృశ్యం

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయంలోని అన్నమయ్య కళావేదికపై శ్రీ సాయి మంజీర కూచిపూడి ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న 14వ అంతర్జాతీయ నృత్య దినోత్సవం–2024 బుధవారం రెండో రోజు కొనసాగాయి. ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు లంకా విజయబాబు జ్యోతి ప్రజ్వలన చేయగా, డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. కూచిపూడి నృత్య సంప్రదాయంలో ప్రప్రథమంగా డోలు, నాదస్వరంతో వినూత్న కార్యక్రమం చేపట్టారు. డాక్టర్ ఖాజావెంకట సుబ్రహ్మణ్యం దర్శకత్వం నిర్వహించారు. గాత్రం జె.భువనేశ్వరి, టీఎం కృష్ణారావు, నాదస్వరం ఎంవీ సుబ్బరామయ్య, క్యాసియో తిన్నలూరి హరిబాబు, డోలుపై ఎం.హరిబాబు సహకారం అందించారు. అనంతరం పచ్చల నాగమహిత, తాళ్లూరి ధరణి, బీసా బత్తిని పూజితశ్రీలను యువ కళారత్న పురస్కారంతో సన్మానించారు. పఠకమూరి సుప్రియ, చేసేంద్ర గ్గాయత్రి, ఎర్రగుంట హేమజోషిక చౌదల నాట్యం ప్రేక్షకులను అలరించాయి. కార్యక్రమంలో మంగళంపల్లి బాలమురళీకృష్ణ ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.ఎస్.గోవిందరాజన్, సంస్థ కార్యదర్శి వెంకటగిరినాగలక్ష్మి, గరికపాటి శిరీష పాల్గొన్నారు.

విరామ బైబిల్ పాఠశాల తరగతులు ప్రారంభం

తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ఉండవల్లిలో నూతన యెరుషలేము ప్రార్థన మందిరంలో బుధవారం నుంచి విరామ బైబిల్ పాఠశాల తరగతులు ప్రారంభమైనట్లు దైవ సేవకుడు ఐజక్ చార్లెస్ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తరగతులను విజయవాడ కర్మెల్ ప్రార్థన మందిరం దైవ సేవకులు, జిల్లా ఇన్‌చార్జి జోసఫ్ ప్రారంభించారని, మే 4వ తేదీ వరకు 10 రోజులు నిర్వహించనున్నామని తెలిపారు. ప్రతిరోజు ఉదయం 7 నుంచి 10 గంటల వరకు విద్యార్థులకు, యవ్వనస్తులకు బైబిల్ పాఠాలు, క్రాఫ్ట్స్, గేమ్స్, యాక్షన్ సాంగ్స్, వర్క్‌బుక్స్, పెప్పెట్ షో వంటి కార్యక్రమాల్లో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. మొదటిరోజు ప్రపంచం – మానవ సృష్టి అనే అంశంపై బైబిల్ పాఠాలు నేర్పించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహోదరులు డైమండ్ రాజు, ప్రకాష్, ఆనందరాజు, తిమోతి, దైవ సేవకురాలు ప్రిస్కిల్లా చార్లెస్, హైదరాబాద్, మదనపల్లి నుంచి సండే స్కూల్ టీచర్లు పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యంపై ఫిర్యాదు

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని గుండిమెడకు చెందిన విద్యార్థి కనిపించడం లేదంటూ విద్యార్థి బాబాయి బుధవారం తాడేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ రమేష్ వివరాల మేరకు.. గుండిమెడకు చెందిన కాట్రగడ్డ యశ్వంత్ గుండిమెడలో ఉన్న హాస్టల్‌లో ఉంటున్నాడు. నెల 20న హాస్టల్ నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని, కుటుంబ సభ్యులు, బాబాయి మహేంద్ర చుట్టుపక్కల విచారించి, బంధువులను అడిగినా ఎటువంటి ఆచూకీ లభించకపోవడంతో ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఎవరైనా యశ్వంత్‌ను గుర్తుపడితే 86888 31355, 92912 82666, 86865 53666 నంబర్లకు తెలియజేయలని ఎస్ఐ రమేష్ కోరారు.

నిర్మల ఫార్మసీ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్, ఏక్విటీ సొల్యూషన్స్ ప్రతినిధులు

తాడేపల్లిరూరల్: మంగళగిరి రూరల్ ఆత్మకూరులోని నిర్మల ఫార్మసీ కళాశాలలో బుధవారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పాములరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రముఖ బహుళజాతి సంస్థ ఏక్విటీ సొల్యూషన్స్ తమ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించిందని, వివిధ కళాశాలల నుంచి వచ్చిన 120 మంది విద్యార్థులకు రాత, శ్రవణ పరీక్షలు, బృంద చర్చలు నిర్వహించినట్లు వెల్లడించారు. ఇందులో 27 మంది విద్యార్థులు ఎంపికయ్యారని, వీరికి వార్షిక వేతనంగా రూ.4.8 లక్షలు అందజేయబడతాయని తెలిపారు. కళాశాల సెక్రటరి సిస్టర్ జి.నిర్మలజ్యోతి మాట్లాడుతూ ఎంపికైన వారిలో నిర్మల ఫార్మసీ కళాశాల విద్యార్థులు 11 మంది ఉన్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ శంఖుల కామేశ్వరరావు, సమన్వయకర్తలు డాక్టర్ సుధీర్, జోజిబాబు, ప్రాతూరి అశోక్ కుమార్, సాంకేతిక సిబ్బంది శ్రీహరి, విజయ్‌కుమార్, ప్రసాద్ పాల్గొన్నారు.

నేటి నుంచి కిడ్నీ ఉచిత పరీక్షలు

మంగళగిరి: నగరంలోని ఇందిరానగర్ యూపీహెచ్‌సీలో గురు, శుక్రవారాల్లో ఉచిత కిడ్నీ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని మెడికల్ అధికారిణి డాక్టర్ పి.అనూష తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. సుమారు ఐదేళ్ల నుంచి దీర్ఘకాలికంగా బీపీ, షుగర్‌లతో బాధపడే వారికి, కిడ్నీ సమస్యలు ఉన్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. గుండె సంబంధిత వ్యాధులతో బాధపడేవారు, గుండెకు స్టంట్ వేయించుకున్న వారు కూడా ప్రస్తుతం వాడుతున్న మందులతో హెల్త్ సెంటర్‌కు వచ్చి కిడ్నీ పరీక్షలు చేయించుకోవచ్చునన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరీక్షలు చేయడం జరుగుతుందన్నారు. సంబంధిత వ్యాధులు ఉన్న రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ అనూష కోరారు.